నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, ఆదివారం 10 నవంబర్ 2024 | NIZAMABAD

బాల్కొండలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కేసీఆర్, వేముల చిత్రపటాలకు క్షీరాభిషేకం

బాల్కొండ, నవంబర్ 9: బాల్కొండలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి చిత్రపటాలకు స్థానికులు శనివారం క్షీరాభిషేకం చేశారు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ ఫంక్షన్‌హాల్ నుంచి మల్లన్నగుట్ట మీదుగా డబుల్ బెడ్రూం ఇండ్ల వరకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ.2.65 కోట్లను విడుదల చేశారు. తాజాగా నిర్మాణ పనులు పూర్తి కావడంతో స్థానికులు కేసీఆర్, వేముల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి సంబురాలు నిర్వహించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సాగర్‌యాదవ్, నేతలు సూరజ్‌రెడ్డి, బూస నరహరి, కన్న పోశెట్టి, ఫయాజ్‌అలీ, ఎంఏ.షహీద్, చిన్న బాలరాజేశ్వర్, ప్రసాద్‌గౌడ్, గాండ్ల రాజేశ్, ధర్మాయి రాజేందర్, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వే షురూ..

- వివరాలు సేకరించిన ఎన్యుమరేటర్లు
- ప్రజల్లో అనేక ప్రశ్నలు, అనుమానాలు

భిక్కనూరులో సమగ్రసర్వేను పరిశీలిస్తున్న రాష్ట్ర ట్రైబల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ శరత్

ఇందల్వాయి/భిక్కనూరు/రామారెడ్డి, నవంబర్ 9: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వే శనివారం ప్రారంభమైంది. ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలు నమోదు చేశారు. అయితే, వివరాల సేకరణకు వెళ్లిన సిబ్బందికి ప్రజల నుంచి అనుకోని ప్రశ్నలు ఎదురయ్యాయి. సర్వే ఎందుకు చేస్తున్నారు..? వివరాలు తీసుకుని ఏం చేస్తారు? స్థిరాస్తుల వివరాలు చెబితే ప్రభుత్వ పథకాలు అందకుండా పోతాయా? వంటి అనేక సందేహాలను లేవనెత్తారు. ఎన్యుమరేటర్లు వారికి సర్దిచెప్పి వివరాలు అడిగి నమోదు చేసుకున్నారు.

ఉన్నతాధికారుల పరిశీలన

సర్వే ప్రారంభమైన నేపథ్యంలో ఉన్నతాధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించారు. ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి శరత్ రెండు జిల్లాల్లో పర్యటించి వివరాల సేకరణను పరిశీలించారు. ఇందల్వాయి, భిక్కనూరు మండలాల్లో పర్యటించిన ఆయన సిబ్బందితో పాటు గ్రామస్తులతో మాట్లాడారు. సమగ్ర సర్వేలో పక్కా సమాచారం సేకరించాలని సిబ్బందికి సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించడానికి దోహదపడుతుందన్నారు. సర్వేకు ప్రజలు సహకరించాలని సూచించారు. మరోవైపు, కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ రామారెడ్డిలో పర్యటించి సర్వే కొనసాగుతున్న తీరును పరిశీలించారు. ఎటువంటి పొరపాట్లు జరగకుండా వివరాలు నమోదు చేయాలని ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లను ఆదేశించారు.

సోయారైతు దిగాలు

- పంటను అమ్ముకునేందుకు కర్షకుల తిప్పలు
- మహారాష్ట్ర మార్కెట్‌కు తరలిస్తున్న రైతులు
- ఉమ్మడి జిల్లాలో 1.30 లక్షల ఎకరాల్లో సోయా సాగు
- సేకరణ లక్ష్యం 18 వేల మెట్రిక్ టన్నులే..
- సోయారైతులను పట్టించుకోని రేవంత్ సర్కారు
- వ్యాపారులకు వరంగా మారిన ప్రభుత్వ నిర్లక్ష్యం

మహారాష్ట్రలోని ఉద్గిర్ మార్కెట్‌కు సోయాను తరలించేందుకు శనివారం పెద్దకొడప్‌గల్‌లో వాహనాల్లో సోయా బస్తాలను ఎక్కిస్తున్న రైతులు

నిజామాబాద్, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : సోయా రైతులు డీలా పడుతున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు సరైన ధర రాక దిగాలు చెందుతున్నారు. చేసేది లేక ఉమ్మడి జిల్లా రైతులు పంటతో సహా పక్క రాష్ట్రానికి పయనమవుతున్నారు. కొనే వారు దిక్కు లేక, దళారుల చేతిలో మోసపోవడం ఇష్టం లేక వ్యయ ప్రయాసాలకోర్చి సోయాబీన్‌ను మహారాష్ట్రకు తీసుకెళ్తున్నారు. కామారెడ్డి జిల్లా పెద్దకొడప్‌గల్ మండలంలో సోయాబీన్ సాగు చేసిన రైతులంతా పంటను మహారాష్ట్ర వ్యాపారులకు అప్పగిస్తున్నారు. మన రైతులకు రేవంత్ ప్రభుత్వం నుంచి భరోసా లేకపోవడంతో ఈ దుస్థితి ఏర్పడింది. కేసీఆర్ పాలనలో సోయా రైతులకు కొండంత అండ ఉండేది. పంటను ఉన్నచోటే అమ్ముకునే పరిస్థితులు ఉండేవి. కానీ కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో రైతులకు కష్టాలు మొదలయ్యాయి. ప్రైవేటు వర్తకులు మోసం చేస్తుండడంతో చేసేది లేక పెద్దకొడప్‌గల్, బిచ్కుంద మండలాల్లో చాలా మంది మహారాష్ట్రలోని ఉద్గిర్ మార్కెట్‌కు పంట ఉత్పత్తులను తరలిస్తున్నారు.

నామమాత్రపు కొనుగోళ్లు..

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో 1.30 లక్షల ఎకరాల్లో సోయా సాగయితే, 18వేలు మెట్రిక్ టన్నుల సోయాబీన్‌ను మాత్రమే సేకరించాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. నిజామాబాద్‌లో 10 కొనుగోలు కేంద్రాల ద్వారా 5 వేల మెట్రిక్ టన్నులు, కామారెడ్డిలో 7 కేంద్రాల ద్వారా 13 వేల మెట్రిక్ టన్నుల సోయాను సేకరించాలని మార్క్‌ఫెడ్ నిర్ణయించింది. కానీ నెలన్నర రోజుల్లో ఇప్పటిదాకా సేకరించింది 4వేల మెట్రిక్ టన్నులు మాత్రమే. అధికారిక లెక్కల ప్రకారం నిజామాబాద్‌లో 2,047 మంది రైతుల నుంచి 2,712 మెట్రిక్ టన్నులు, కామారెడ్డిలో 762 మంది నుంచి 1,326 మెట్రిక్ టన్నులను మాత్రమే సేకరించారు. మొన్నటిదాకా ఎకరాకు 6 క్వింటాళ్లు చొప్పున మాత్రమే కొనుగోలు చేశారు. అయితే రైతుల ఇబ్బందులను గమనించిన బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేయడంతో కండ్లు తెరిచిన ప్రభుత్వం ఎకరాకు 10 క్వింటాళ్ల చొప్పున సేకరించాలని నిర్ణయించింది. కానీ ఇది క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. పైగా టార్గెట్‌లో మార్పులు, చేర్పులు చేయలేదు. దీంతో కొనుగోలు కేంద్రాలు పెరగలేదు. సోయా సేకరణలో జోరందుకోలేదు.

సవాలక్ష కొర్రీలు..

జిల్లాలో ఎకరాకు 12 క్వింటాళ్ల నుంచి 14క్వింటాళ్ల వరకు సోయా పంట దిగుబడి వస్తున్నది. కానీ ప్రభుత్వం మొత్తం పంటను కొనకుండా కొంతే కొంటామని కొర్రీలు పెట్టింది. రైతు ప్రభుత్వం అంటూ గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ సర్కారు ఏలుబడిలో మొన్నటిదాకా ఎకరాకు 6 క్వింటాళ్లు మాత్రమే సేకరించారు. రైతుకు మద్దతుగా బీఆర్ఎస్ గళం విప్పడంతో 10 క్వింటాళ్లు సేకరించేందుకు సర్కారు నిర్ణయించింది. కానీ క్షేత్ర స్థాయిలో ఏమాత్రం మార్పు కనిపించడం లేదు. ఎకరాకు 10 క్వింటాళ్లకు పైగానే పండించిన రైతులకు మిగిలిన సోయాను ఏం చేయాలో అర్థం కావడం లేదు. సగం పంటను ప్రభుత్వానికి, మిగిలిన సోయాను ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకోవడం ఇబ్బందిగా మారింది. దళారులకే మొత్తం అమ్ముదామంటే గిట్టుబాట ధర రావడం లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆంక్షలు దళారులకు అవకాశంగా మారింది. కేంద్రం నిర్దేశించిన మేరకు సోయాకు కనీస మద్దతు ధర క్వింటాకు రూ.4892 కాగా, ప్రైవేట్‌లో అమ్మితే వ్యాపారులు రూ.4300 మాత్రమే చెల్లిస్తున్నారు. మరోవైపు, కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి పంటకు రూ.500 బోనస్ ఇస్తామంటూ గొప్పలు చెప్పింది. గద్దెనెక్కాక సోయాకు బోనస్ మాటెత్తకపోవడంపై రైతులు మండిపడుతున్నారు. సోయాకు బోనస్ ఇస్తే మద్దతు ధర కలిపి క్వింటాకు రూ.5,392 చొప్పున లభించాల్సి ఉంది. కానీ రేవంత్ సర్కారు మూలంగా రైతు రూ.వెయ్యికి పైగా నష్టపోతున్నాడు.

ధర తక్కువ చెబుతుండ్రు..

సోయా కొనుగోలు కేంద్రాలు లేకపోవుడుతోని మస్తు తిప్పలైతుంది. టైంకు కేంద్రాలు తెరువలేదు. దిక్కులేక పంటను ప్రైవేటుల అమ్ముకునుడు అవుతున్నది. ప్రైవేటోళ్లు తక్కువ ధర చెబుతుండ్రు. మునుపు సమయానికి కొనుగోలు కేంద్రాలు తెరిచి సోయాను సేకరించేటోళ్లు. ఇప్పుడెవరు పట్టించుకుంటలేరు.

- వంకాయల ఎల్లప్ప, బేగంపూర్, పెద్దకొడప్‌గల్ మండలం

సోయా రైతులను ఆదుకోవాలి..

నాలుగెకరాల్లో సోయా ఏసిన. 35 క్వింటాళ్ల పంట అచ్చింది. సర్కారోళ్ల లెక్క ప్రకారం అధికారులు 30 క్వింటాళ్లే కొంటామంటున్నారు. అది కూడా పత్తా లేకుండా పోయిండ్రు. ఏం చేయాల్నో సమజైతలేదు. ప్రైవేటోళ్లకు అమ్ముదామంటే ధర తక్కువ చెబుతుండ్రు.

- ఎం.డి.అప్రోజ్, సోయా రైతు, పెద్దకొడప్‌గల్

ప్రభుత్వ ఆదేశాల మేరకే..

ప్రభుత్వ ఆదేశాల మేరకు సోయా పంట సేకరిస్తున్నాం. అవసరాన్ని బట్టి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

- మహేశ్, మార్క్‌ఫెడ్ ఇన్‌చార్జి మేనేజర్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా

కుల గణన బహిష్కరణ

లబానా లంబాడాల వెల్లడి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న లబానా లంబాడా రాష్ట్ర అధ్యక్షుడు తాన్‌సింగ్ నాయక్

కామారెడ్డి రూరల్ , నవంబర్ 9 : లబానా లంబాడ కులాన్ని బీసీ కుల గణనలో చేర్చక పోవడాన్ని నిరసిస్తూ కుల గణనను బహిష్కరిస్తున్నట్లు లబానా లంబాడా సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు తాన్‌సింగ్ నాయక్ తెలిపారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలోని తొమ్మిది నియోజకవర్గాల్లో 2 లక్షల మందికి పైగా లబానా లంబాడాలు ఉన్నారని, తామంతా కుల గణనకు దూరంగా ఉంటామని చెప్పారు. బీసీ కుల గణనలో లబానా లంబాడాలకు భాష, బీసీ కుల జాబితాలో గుర్తింపు ఇచ్చిన తర్వాతే కుల గణన చేపట్టాలన్నారు. కుల గణనలో తమ కులం గుర్తింపు కోసం ఆప్షన్ ఇవ్వాలని ఈ నెల 5న కలెక్టర్‌కు నేరుగా విన్నవించామని, చీఫ్ సెక్రెటరీకి మెయిల్ ద్వారా విజ్ఞప్తి చేశామన్నారు. 1977లో తాము బీసీ జాబితా నుంచి ఎస్టీ జాబితాలో చేరామని, ఇప్పుడు మధుర లంబాడా జాబితాలో చేర్చితే ఒప్పుకునేది లేదని స్పష్టం చేశారు. తమను మధుర లంబాడా నుంచి లబానా లంబాడా కులంగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అప్పటిదాకా గణన చేపట్టొద్దన్నారు. ఈనెల 26లోపు లబానా భాషను, కులం ఆప్షన్‌గా చూపించి గణన చేపట్టాలని కోరారు. ఆప్షన్ వచ్చే వరకు సర్వేలో పాల్గొనేది లేదని స్పష్టంచేశారు.

ఇష్టం లేని పెండ్లి చేస్తున్నారని
ఆత్మహత్య

గాంధారి, నవంబర్ 9 : ఇష్టం లేని పెండ్లి చేస్తున్నారని మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. గాంధారి ఎస్సై ఆంజనేయులు కథనం ప్రకారం.. మండలంలోని జువ్వాడి గ్రామానికి చెందిన ముచ్చర్ల సంపత్ (22)కు పెండ్లి చేయాలని కుటుంబ సభ్యులు నిర్ణయించారు. అయితే, తనకు ఇష్టం లేని పెండ్లి చేస్తున్నారని మనస్తాపానికి గురైన అతడు రెండ్రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ దొరకలేదు. శనివారం గ్రామశివారులోని వ్యవసాయ బావిలో మృతదేహం ఉన్నట్లు గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. వారు వచ్చి మృతదేహాన్ని బయటికి తీయించి చూసి సంపత్‌గా గుర్తించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ముచ్చర్ల సంపత్ (ఫైల్)

మంచి నడవడికతోనే
ఉత్తమ భవిష్యత్తు

కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి రూరల్, నవంబర్ 9: సమాజానికి విద్యార్థులే దిక్సూచి అని కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. చదువుకునే వయస్సులోనే విద్యార్థులు మంచి నడవడిక అలవర్చుకోవడం ద్వారా అనుకున్న లక్ష్యాన్ని సాధించడంతో పాటు సమాజాన్ని బాగు చేయవచ్చన్నారు. కామారెడ్డిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన పబ్లిక్ సేఫ్టీ అంబాసిడర్స్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజల శ్రేయస్సు కోసం ఎస్పీ సింధూశర్మ చొరవతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ఇందులో ఎంపికైన వారంతా మంచి నడవడికతో వ్యవహరించడంతో పాటు బాధ్యతాయుతంగా ఉండాలని సూచించారు. ప్రస్తుత సమాజంపై అవగాహన ఉండాలన్న ఆలోచనతోనే 'బ్రాండ్ అంబాసిడర్'కు శ్రీకారం చుట్టామని ఎస్పీ సింధూశర్మ తెలిపారు. సమాజానికి ఏదైనా మంచి చేయాలనే బలమైన ఆలోచనతో ఉంటారనే విద్యార్థులు, యువకులను ఈ కార్యక్రమాన్ని ఎంచుకున్నట్లు చెప్పారు. ఎంపికైన వారిని సైబర్‌సేఫ్టీ క్లబ్, రోడ్ సేఫ్టీ క్లబ్, ఉమెన్ సేఫ్టీ క్లబ్, యాంటీ ర్యాగింగ్, యాంటీ డ్రగ్ కమిటీ, సోషల్ రెస్పాన్సిబిలిటీ క్లబ్, హెల్త్ అండ్ వెల్నెస్ క్లబ్‌లో చేర్చి ఆయా అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఒక్కో క్లబ్‌లో విద్యార్థులు ఆరుగురు, తల్లిదండ్రులు నలుగురు, ఒక అధ్యాపకుడు ఉంటారని వివరించారు. ఆరు సేఫ్టీ క్లబ్‌లలో మొత్తం 21 కాలేజీల నుంచి వెయ్యి మందికి పైగా నియమించామని, వారికి ఆరు అంశాల్లో అవగాహన కల్పిస్తామన్నారు. భవిత్యత్తు గురించి ఆలోచించినప్పుడు మన భద్రత గురించి కూడా ఆలోచించాల్సిన అవసరం ఉందని తెలిపారు. డీఎస్పీ నాగేశ్వర్‌రావు, సీఐలు చంద్రశేఖర్‌రెడ్డి, రామన్, ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న కామారెడ్డి ఎస్పీ సింధూశర్మ, పాల్గొన్న కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు

రేపటి నుంచి గురుకులాల సందర్శన

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ నాయకులు

ఖలీల్‌వాడి, నవంబర్ 9 : గురుకులాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం రేపటి నుంచి నాలుగు రోజుల పాటు ఆయా విద్యాసంస్థలను సందర్శించనున్నట్లు బీఆర్ఎస్వీ నేతలు తెలిపారు. క్షేత్ర స్థాయిలో ఉన్న సమస్యలు తెలుసుకుని మంత్రుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. నిజామాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో బీఆర్ఎస్వీ నేత పొద్దుటూరి అభిలాశ్‌రెడ్డి శనివారం విలేకరులతో మాట్లాడారు. అన్ని గురుకులాలను సందర్శించి, విద్యార్థుల సమస్యలు తెలుసుకుని పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. గురుకులాల్లో విద్యార్థులు మృతి చెందుతున్నా సీఎం గానీ, మంత్రులు గానీ కనీసం ఒక్క సమీక్ష కూడా నిర్వహించక పోవడం దారుణమని తెలిపారు. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ప్రభుత్వం.. హాస్టళ్లకు నిత్యావసర సరుకులు సరఫరా చేసే వారికి బిల్లులు సకాలంలో చెల్లించక పోవడంతో వారు నాణ్యమైన ఆహారాన్ని అందించడం లేదన్నారు. ఏడాదికి రెండు యూనిఫామ్స్ ఇవ్వాల్సి ఉండగా, రేవంత్ సర్కారు ఒక్కటే ఇస్తున్నదని తెలిపారు. ప్రభుత్వం మొద్దునిద్ర వీడి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రెస్ మీట్‌లో ప్రశాంత్ కునాల్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.